నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 19 నవంబర్ 2024 | NALGONDA

మారని తీరు.. మళ్లీ అదే తంతు

- అర్హత లేని ఏజెన్సీలకు అందలం
- నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి కల్పన శాఖాధికారుల వ్యవహారం

సూర్యాపేట, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను థర్డ్ పార్టీ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు కేటాయిస్తుండగా అలాంటి ఏజెన్సీల ఎంపికలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఏజెన్సీల కేటాయింపుల్లో పారదర్శకత పాటించడం లేదని పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ అధికారులు చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం ఏదైనా శాఖలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగాలు కేటాయించాలంటే సదరు ఏజెన్సీకి ఫర్మ్ రిజిస్ట్రేషన్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, కాంట్రాక్టు లైసెన్స్‌తో పాటు ఆరు నెలల పాటు పీఎఫ్, ఈఎస్ఐ ఇచ్చి ఉండాల్సి ఉండగా ఈ సారి అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి అర్హత లేని ఏజెన్సీలకు కట్టబెడుతున్నారు. ఇటీవల సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలో మళ్లీ అర్హత లేని, యూటీఐ నెంబర్ లేని ఓ ఏజెన్సీకి ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఏజెన్సీని ఇస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయమై సోమవారం పలువురు కోర్టుకు కూడా వెళ్లినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని ఏజెన్సీలకు కేటాయింపు విషయంలో ఏం జరుగుతుందో, ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

ఏం సాధించారని విజయోత్సవాలు

- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- హామీల అమలులో సర్కారు విఫలం
- తులం బంగారం, పింఛన్ల పెంపు ఊసే లేదు
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

కొండమల్లేపల్లి, నవంబర్ 18 : రేవంత్ సర్కార్ 11 నెలల పాలనలో ఏమి సాధించి పెట్టారో, ఏ హామీలు అమలు చేశారో ప్రజలకు వివరించి విజయోత్సవాలు జరుకోవాలని మాజీ ఎంపీ, సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బడుగు లింగయ్య యాదవ్ అన్నారు. కొండమల్లేపల్లిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలవిగాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందన్నారు. పథకాల విషయంలో రైతులకు ఇచ్చిన మాట కూడా తప్పిందని తెలిపారు. ఎన్నికల ముందు కల్యాణలక్ష్మితోపాటు పెండ్లి కానుకగా తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు లక్షల రూపాయల కాదుకదా తులం బంగారం ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ప్రతి మహిళకు రూ.2,500 చొప్పున పింఛన్, వృద్ధులు, వితంతవులు, బీడీ కార్మికులకు పింఛన్లు పెంచుతామని మోసం చేసిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పేరిట రూ.10 వేలు ఇస్తే దాని పేరు రైతుభరోసాగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని చెప్పి 11 నెలల గడిచినా అతీగతిలేదని మండిపడ్డారు. రైతుబంధు ఇవ్వకుండా రైతుల నోట్లో మట్టి కొట్టారన్నారు. 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ జరుగ లేదని ఆరోపించారు. పత్తి, ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పాలన గాడి తప్పిందని, వ్యాపారులు, రైతులు, రియల్టర్లు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం రూ.90 వేల కోట్ల అప్పులు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని చెప్పారు. ఎటు చూసిన ధర్నాలు, రాస్తోరోకోలు చేస్తున్నారని, ప్రభుత్వం ఎవరినీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 11 నెలల్లో గురుకులాల్లో కలుషిత ఆహారం, వివిధ కారణాలతో 36 మంది విద్యార్థులు చనిపోయినా పట్టించుకునే నాథుడే లేదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రమంతా గులాబీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుండబోయిన లింగం యాదవ్, పెద్దిశెట్టి సత్యనారాయణ, బోడ గిరి, వెంకటయ్య పాల్గొన్నారు.

మిల్లులకు పోటెత్తిన పత్తి

వరుస సెలవులతో భారీగా రాక
బారులుదీరిన వందలాది ట్రాక్టర్లు
తేమ పేరుతో ట్రాక్టర్‌కు రెండు క్వింటాళ్ల పత్తి కోత

పెద్దఅడిశర్లపల్లి : తిరుమల కాటన్ మిల్లు వద్ద నిలిచి ఉన్న వందలాది పత్తి ట్రాక్టర్లు

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 18 : మండలంలోని పత్తి మిల్లులకు భారీగా పత్తి ట్రాక్టర్లు వచ్చాయి. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో నిలిచిపోయిన కొనుగోళ్లు సోమవారం ప్రారంభమయ్యాయి. దాంతో వివిధ ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో పత్తి భారీగా వచ్చింది. దాంతో పత్తి ట్రాక్టర్లు బారులుదీరి కనిపించాయి. కొంత మంది రైతులు సెలవు రోజుల్లో పత్తి తేవడంతో మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొండమల్లేపల్లి సీసీఐ పరిధిలో పీఏపల్లి, మల్లేపల్లి, డిండి మండలాలకు కలిపి ఐదు మిల్లులో పత్తి కొనుగొలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు 74 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయగా మరో 70 వేల క్వింటాళ్లకు పైగా మిల్లుల వద్ద ట్రాక్టర్లు నిలిచి ఉన్నాయి. సెలవు దినాలతోపాటు ప్రభుత్వం నుంచి స్పష్టమైన అదేశాలు రాకపోవడంతో దాదాపు ప్రారంభించిన పది రోజుల వరకు కొనుగోలు చేయలేదు. దాంతో పత్తి భారీగా పేరుకుపోయింది. పీఏపల్లి మండలంలోని చిలకమర్రి మిల్లుల వద్ద సోమవారం వందలాది ట్రాక్టర్లు బారులుదీరాయి. ఇందులో చాలా వరకు తేమ పేరుతో తిరస్కరించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మరికొంత మందికి రైతుల వద్ద ట్రాక్టరుకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు కోత విధించడంతో చేసేది లేక పత్తి విక్రయించుకుంటున్నారు. దీనికి తోడు కొన్ని మిల్లుల వద్ద దళారుల హవా కొనసాగుతున్నది. గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి, మిల్లుల వద్ద పట్టా పాస్‌పుస్తకాలు ఉన్న రైతుల పేర్ల మీద ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. రోజుల తరబడి మిల్లు వద్ద ఉన్న రైతుల కంటే దళారుల పత్తి ముందుగా దిగుమతి కావడం విశేషం. గతంలో పత్తి మిల్లు వద్ద వేగంగా దిగుమతులు జరిగేవని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కొనుగోళ్లు ముందుకు సాగడం లేదని రైతులు వాపోతున్నారు.

ఐదు రోజులుగా తిరుగుతున్నాం

నేను ఐదు రోజుల క్రితం 20 క్వింటాళ్ల పత్తిని మిల్లుకు తీసుకొచ్చిన. మొదటి రెండురోజులు మాశ్చర్ చూడలేదు. తర్వాత మూడు రోజులు సెలవులు రావడంతో ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ పత్తి అమ్ముకోవడానికి ఇంత ఇబ్బంది పడలేదు. ఒక పక్క ట్రాక్టర్ కిరాయి పడుతున్నది. ఇయ్యాల కొంటరేమోనని ఎదురు చూస్తున్నాం.

- కేతావత్ బాలు ,సాగర్

పత్తి కొనుగొలు వేగవంతం చేస్తున్నాం

కొండమల్లేపల్లి సీసీఐ కేంద్రం పరిధిలో 5 మిల్లుల ద్వారా పత్తిని కొనుగోలు చేస్తున్నాం. వరుసగా సెలవులు రావడం తోవ కొంత పత్తి భారీగా నిలిచింది. దీంతో సోమవారం ఒక్క రోజే 4 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశాం. తేమ పేరుతో కోతలు లేకుండా చూస్తాం. దళారులు వచ్చినా మేము భూమి ఉన్న రైతు ఫొటో బయోమెట్రిక్ తీసుకొని వారి ఖాతాలోనే డబ్బులు వేస్తాం.

- కిరణ్, సీసీఐ అధికారి

గంజాయి తరలించేందుకు కారులో ఏర్పాటు చేసిన పెట్టెను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

లగ్జరీ కార్లలో గంజాయి తరలింపు

- కారు వెనుక సీటు కింది భాగంలో ప్రత్యేక బాక్స్‌ల ఏర్పాటు
- ఛేదించిన సూర్యాపేట పట్టణ, కోదాడ రూరల్ పోలీసులు
- రెండు కేసుల్లో 28లక్షల విలువైన 110కిలోల గంజాయి సీజ్
- 3 కార్లు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం.. ఏడుగురు అరెస్టు
- వివరాలు తెలిపిన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట టౌన్, నవంబర్ 18 : పోలీసులకు అనుమానం రాకుండా ఖరీదైన కార్లను ఉపయోగిస్తూ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా సూర్యాపేట జిల్లాలో పోలీసులు పట్టుకున్నారు. కారు వెనుకాల బంపర్ డూమ్ మధ్యలో ప్రత్యేకంగా జాలి ఏర్పాటు చేసి అందులో గంజాయి ప్యాకెట్లు పెట్టి తరలిస్తున్నారు. తనిఖీల్లో కార్లను సూర్యాపేట పట్టణ, కోదాడ రూరల్ పోలీసులు పట్టుకోగా విషయం బయటికి వచ్చింది. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో కేసులకు సంబంధించిన వివరాలను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు. సూర్యాపేట టూ టౌన్ ఎస్ఐ గోపికృష్ణ తన సిబ్బందితో జాతీయ రహదారి ఎన్టీఆర్ పార్క్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా గుర్తు తెలియని రెండు కార్లు అనుమానాస్పదంగా ఒకదాని వెంట ఒకటి పట్టణంలోకి రావడాన్ని గమనించారు. ఆపి తనిఖీ చేస్తుండగా కారులోని నిందితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బచ్చల మోహనకృష్ణ, కోరా అచ్యుత్‌రాజు, షేక్ ఖాసీం, హుక్కావాయి విజయ్, బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్ పారిపోయేందుకు ప్రయత్నించడంతో వారిని పట్టుకొని విచారించారు. షేక్ ఖాసీంకు పరిచయమున్న కర్నాటకకు చెందిన హుక్కావాయి విజయ్, అతని కుమారుడు శుభం కర్నాటకలోని బీదర్ ప్రాంతంలో గంజాయి అమ్ముతూ ఎక్కువ డబ్బులు సంపాదిస్తూ అప్పుడప్పుడు మహారాష్ట్రకు కూడా వెళ్లి విక్రయిస్తుంటారు. అప్పుడప్పుడు ఖాసీంతో పాటు ఒడిశాకు వెళ్లేవారు. ఈ నెల 16న షేక్ ఖాసీంతో పాటు హుక్కావాయి విజయ్, శుభం కార్లకు డ్రైవర్లుగా బొమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, షేక్ మౌలాలు ఉండి అందరూ ఖాసీంకు చెందిన రెండు కార్లలో ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా చింత్రకొండ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ బాచెలి మోహన్‌కృష్ణ, కోర అచ్యుతరాజు వద్ద 72కిలోల గంజాయిని కిలో రూ.2,500 చొప్పున కొనుగోలు చేసుకొని కారు వెనుకవైపు డిక్కి కింద పెట్టి సాయంత్రం అక్కడ నుంచి బయల్దేరారు. కర్నాటకలోని బీదర్ ప్రాంతానికి వెళ్లడానికి విజయవాడ, సూర్యాపేట, హైదరాబాద్ మీదుగా వెళ్తుండగా సూర్యాపేట వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి ప్యాక్ చేసిన గంజాయి ప్యాకెట్లు ఒక కారులో 9, మరో కారులో 9 మొత్తం 75కిలోల 17గంజాయి ప్యాకెట్లు, 8సెల్ ఫోన్స్, 2 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మరో కేసులో నిందితుడు మహారాష్ట్రకు చెందిన నిందితుడు మీరగానే ప్రభాకర్ రోడ్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తూ గంజాయికి బానిసై గంజాయి వ్యాపారం చేసేందుకు నిర్ణయించుకున్నాడు. ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా చుట్టు పక్కల ప్రాంతాల్లో తనకు తెలిసిన వారి కారు తీసుకొని ఒడిశాలోని సీలేరులో ఓసారి గంజాయి కొనుగోలు చేసి భద్రాచలం మీదుగా పట్టుకెళ్లి కొంత డబ్బు సంపాదించాడు. తరువాత ఎక్కువ మొత్తంలో గంజాయిని పట్టుకెళ్లాలనుకొని అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడు. అక్కడ జైలులో పలువురి నుంచి గంజాయి రవాణా విషయం తెలుసుకొన్నాడు. బయటికి వచ్చిన తర్వాత ఈ నెల 16న గంజాయి తీసుకొని పలాస నుంచి విశాఖపట్నం, విజయవాడ మీదుగా కారులో వస్తుండగా ఈ నెల 17న సాయంత్రం కోదాడ దగ్గరలోని చిమిర్యాల క్రాస్ రోడ్ వద్ద కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూ. 9.25లక్షల విలువైన 37.460 కిలోల గంజాయి, కారు, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. నిందితులను పట్టుకోవడంలో బాగా పని చేసిన డీఎస్పీ రవి, మట్టయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, సూర్యాపేట సీఐ రాజశేఖర్, ఎస్ఐలు శ్రీకాంత్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, సూర్యాపేట టౌన్ ఎస్ఐ గోపికృష్ణ, ఎస్ఐ నవీన్, సీసీఎస్ సిబ్బంది, సూర్యాపేట పట్టణ, కోదాడ రూరల్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డ్సు అందజేశారు.

దివ్యాంగుల పింఛన్ 6వేలకు పెంచాలి

- నల్లగొండ కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష

నల్లగొండ కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేస్తున్న దివ్యాంగులు

నల్లగొండ, నవంబర్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల ఆసరా పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మద్దతు తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో నెరవేర్చలేని హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం సరికాదన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన పింఛన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పదకాల్లో ఐదు శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీనివాస్, కొమ్ము హరి, కసిరెడ్డి చైతన్యారెడ్డి, తగుళ్ల వెంకన్న, సైదులు, శంకర్, నగేశ్ పాల్గొన్నారు.

సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల సెంటర్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

ముగిసిన గ్రూప్-3 పరీక్ష

- రెండో రోజు సజావుగా పేపర్-3 ఎగ్జామ్
- నల్లగొండలో 15,257 మంది.. సూర్యాపేటలో 9,232 మంది హాజరు

నల్లగొండలో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రామగిరి/మిర్యాలగూడ/సూర్యాపేట/చిలుకూరు, నవంబర్ 18 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18న నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష సజావుగా ముగిసింది. పేపర్-3 పరీక్ష సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు జరిగింది. నల్లగొండ జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో 88 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 28,353 మందికి 15,257 (45 శాతం) మంది హాజరుకాగా 13,090 మంది గైర్హాజరయ్యారు. నల్లగొండ పట్టణంలో 60 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 20,555 మంది అభ్యర్థులకు 12,357 మంది హాజరుకాగా 8,198మంది గైర్హాజరయ్యారు. మిర్యాలగూడలో 28 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 7,798 మంది అభ్యర్థులకు 2,900 మంది హాజరుకాగా 4,898 మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్, పరీక్ష నోడల్ అధికారి జె.శ్రీనివాస్‌తోపాటు ఆర్డీఓ అశోక్‌రెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తాసీల్దార్ హరిబాబు, టీజీపీఎస్‌సీ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జేఎన్‌టీయూ ప్రత్యేక పరిశీలకుడు విజయ్ భాస్కర్, పరీక్షల రీజినల్ కోఆడినేటర్స్, ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజుతోపాటు పలువురు అధికారులు పరీక్షలను తనిఖీ చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఏఎస్పీ రాములునాయక్ పర్యవేక్ష

నల్లగొండలో హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ణలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు కొనసాగించారు. దీంతో ఎక్కడ ఎలాంటి సంఘటనలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష ముగిసిన తర్వాత పూర్తి మెటీరియల్‌ను ప్రత్యేక బందోబస్తు మధ్య ఎన్‌జీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

సూర్యాపేట జిల్లాలో

సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో గ్రూప్-3 ఎగ్జామ్ నిర్వహించారు. రెండో రోజు 50 పరీక్ష కేంద్రాల్లో 16,543 మంది అభ్యర్థులకు గానూ 9,232 (55.8) మంది హాజరుకాగా 7,311 మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు సబంధించిన పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. జిల్లాలో పరీక్షలు సాఫీగా జరిగేలా పనిచేసిన అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అభినందించారు. అందరి సహకారంతోనే ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

రేపు ఎంజీయూలో జాబ్ మేళా

రామగిరి, నవంబర్ 18: మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఈ నెల 20న జాబ్ మేళా(ప్లేస్‌మెంట్ అండ్ కెరియర్ ఎక్సో-2024) నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వై.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు వర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ సమావేశ మందిరంలో అభ్యర్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని, పూర్తి వివరాలకు 9010203857 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.


కార్తిక సోమవారం సందర్భంగా మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద కృష్ణమ్మకు హారతి పడుతున్న అర్చకులు

బీసీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలి

- కార్పొరేషన్‌తో సబ్సిడీ రుణాలు, వెల్ఫేర్‌తో విద్యాభివృద్ధి చేయాలి
- రాష్ట్రంలో 54శాతం ఉన్న బీసీలపై పాలకులు కరుణ చూపడం లేదు
- వెనుకబడిన, సంచార జాతులను బీసీ ఏ నుంచి ఎస్సీలో చేర్చాలి
- దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి
- బీసీ కమిషన్ ముందు పలు బీసీ సంఘాలు, నేతల విన్నపాలు, సూచనలు
- ప్రభుత్వానికి నివేదించి అమలు దిశగా చర్యలు తీసుకుంటామన్న చైర్మన్ నిరంజన్

నల్లగొండ, నవంబర్ 18 : రాష్ట్రంలో 54శాతానికి పైగా ఉన్న బీసీల పట్ల పాలకులు కరుణ చూపడం లేదని, ఫలితంగా అన్ని రంగాల్లో వెనుకబడ్డ బీసీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించాలని పలు బీసీ సంఘాల నేతలు, ప్రతినిధులు బీసీ కమిషన్ ముందు విన్నవించారు. రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశోధించడానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని బీసీ సంఘాల ప్రతినిధులతో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అధ్యక్షతన బహిరంగ విచారణ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి బీసీ కులాలకు సంబంధించిన వారు బీసీ ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, విద్య, ఉద్యోగాలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు, కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం, వెల్ఫేర్ ద్వారా అరకొర వసతులపై రాతపూర్వకంగా ఇవ్వడంతో పాటు కమిషన్ ముందు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

బీసీలపై చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన..

రాష్ట్ర జనాబాలో బీసీలే సింహ భాగం ఉన్నప్పటికీ ఆది నుంచి పాలకులు చిన్నచూపు చూస్తున్నారని పలువురు నేతలు కమిషన్ ముందు వాపోయారు. ప్రధానంగా బీసీల్లో ఆర్థిక పరిపుష్టిలేక వెనుకబడి పోతున్నారని..ఈ విషయంలో ప్రభుత్వాలు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు రావడం లేదని, వెల్ఫేర్ ద్వారా కావాల్సిన సాయం లేదని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. బీసీల్లో వెనుకబడిన, తక్కువ సంఖ్యలో ఉన్న వాటి కులాల గుర్తింపు అనేదే లేదని, సంచార జాతుల గురించి పట్టించుకునే వారే లేరని, అలాంటి వారికి ప్రభుత్వాలు అండగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంచార జాతులు వేరే రాష్ట్రాల్లో ఎస్సీలుగా ఉంటే ఇక్కడ మాత్రం బీసీ ఏలో చేర్చారని.. అలాంటి వారిని ఎస్సీ కులంలో చేర్చాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన కొన్ని కులాలను బీసీ బీ, బీసీ డీలో కాకుండా బీసీ ఏలో చేర్చాలని మరికొన్ని కులాలు కమిషన్‌ను కోరాయి. బీసీలందరికీ జనాబా ప్రకారం విద్య, ఉద్యోగం, చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని ముక్తకంఠంగా అన్ని సంఘాలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చాయి.

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్,
చిత్రంలో నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హన్మంతరావు, తేజస్ నందలాల్ పవార్ తదితరులు

ప్రతి ఒక్కరి ఆవేదన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: బీసీ కమిషన్ చైర్మన్ గోపి శెట్టి నిరంజన్

బీసీల జీవన విధానం, ఆర్థిక పరిపుష్టి, విద్యా విధానం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుపై ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బీసీలు తమ అభిప్రాయాలు తెలియచేయడంతోపాటు సాదకబాధకాలు చెప్పారని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ప్రతి వ్యక్తి అభిప్రాయాన్ని, ఆవేదనను రాత పూర్వకంగా తీసుకోవడంతో పాటు విన్నామని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

బీసీలపై అనవసరంగా అట్రాసిటీ కేసులు పెట్టిస్తే బీసీ కమిషన్ ఉపేక్షించబోదని, అలాంటి విషయాలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకొని రావాలని చెప్పారు. ప్రధానంగా కొన్ని సంచార, వెనుకబడిన జాతుల వారు బీసీ ఏ నుంచి ఎస్సీ కులంలోకి మార్చాలని విన్నవించారని అన్నారు. బీసీలు ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో వివక్షకు గురవుతున్నారని, కుల వృత్తుల వారు ఇబ్బంది పడుతున్న విషయం తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కుల సర్వే జరుగుతున్నందున ఈ సర్వేలో బీసీలు అందరూ తప్పనిసరిగా పాల్గొని వివరాలు చెప్పాలన్నారు. ఈ సర్వే వల్ల బీసీల జనాభా ఎంతో తెలుస్తుందని..ఈ సర్వే తర్వాత జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కూడా అమలయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 65 నుంచి 70శాతం సర్వే పూర్తి కావడం శుభపరిణామమని, త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు, ఎన్యుమరేటర్లను కోరారు. ఈ బహిరంగ విచారణలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హన్మంతరావు, తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, అధికారులు అలీ, అనసూయ, యాదయ్య పాల్గొన్నారు.